# ప్రజల వద్దకు ప్రభుత్వ వైద్యం

- వెల్‌నెస్ సెంటర్లుగా ఆరోగ్య ఉప కేంద్రాలు
- ఎంఎల్‌హెచ్‌పీలతో వైద్య పరీక్షలు, చికిత్సలు


సుర్దాపూర్‌లో బీపీ పరీక్షలు చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ


గోయగాంలోని వెల్‌నెస్ సెంటర్

**కెరమెరి:** గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను వెల్‌నెస్ సెంటర్లుగా మార్చింది. దీంతో గ్రామాల్లోని ప్రజలకు వైద్య చికిత్సల బాధ తీరింది. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఏ చిన్న వైద్యం అవసరమున్నా కెరమెరి పీహెచ్‌సీకి వెళ్లేవారు. కాని ప్రస్తుతం సబ్ సెంటర్లను ప్రభుత్వం వెల్‌నెస్ సెంటర్లుగా మార్చి వైద్య సేవలు ప్రారంభించడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివిధ రకాల పరీక్షలతో పాటు వైద్య చికిత్సలు సకాలంలో అందుతుండడంతో వెల్‌నెస్ సెంటర్లకు రోగులు బారులు తీరుతున్నారు.

**మండలంలో 34,754 జనాభా**

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ఎనిమిది వెల్‌నెస్ సెంటర్లు ఉన్నాయి. వాటిలో కెరమెరి, దేవాపూర్, గోయగాం, పరంధోళి, సుర్దాపూర్, పాట్నాపూర్, మోడి, సాంగ్విలలో 34,754 జనాభా ఉంది. పరంధోళి, గోయగాం మినహా అన్ని కేంద్రాల్లో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రాక్టీషనర్)లు ఉన్నారు. వారి ద్వారా ఆయా కేంద్రాల్లో వివిధ రకాల పరీక్షలు, వైద్య చికిత్సలు అందుతున్నాయి. ఆయా కేంద్రాల్లో 16 మంది ఏఎన్‌ఎంలు అవసరం ఉండగా కేవలం 10 మంది మాత్రమే ఉన్నారు. మండలం భౌగోళికంగా చాలా పెద్దది. 31 గ్రామ పంచాయతీల్లో 146 గ్రామాలు ఉన్నాయి. వాగులు, వంకలు ఎక్కువగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలం మొత్తం జనాభాకు కెరమెరిలో మాత్రమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. 10వేల జనాభాకు ఒక పీహెచ్‌సీ ఉండాల్సి ఉన్నా ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

**వివిధ రకాల పరీక్షలు**

వెల్‌నెస్ సెంటర్లలో బీపీ, షుగర్, టీబీ, హెచ్‌బీ, మలేరియా, టైఫాయిడ్ తదితర పరీక్షలతో పాటు వైద్య చికిత్సలను సైతం ఎంఎల్‌హెచ్‌పీలు అందిస్తున్నారు. దీంతో పాటు ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికేటెడ్ డిసీజెస్)పై గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నారు. బాలింతలు, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన న్యూట్రీషన్ కిట్స్ అందించడం, వాటి గురించి అవగాహన కల్పించడం వంటి విధులు కూడా నిర్వహిస్తున్నారు.

### వెల్‌నెస్ సెంటర్లలోనే పరీక్షలు



మండలంలోని ఆయా వెల్‌నెస్ సెంటర్ల పరిధిలో ఉన్న ప్రజలు చిన్న పరీక్షలకు కెరమెరి పీహెచ్‌సీకి రావాల్సిన అవసరం లేదు. బీపీ, షుగర్, మలేరియా, తదితర పరీక్షలను స్థానికంగానే చేస్తారు. పెద్ద జబ్బులు ఉంటే మాత్రమే కెరమెరికి రావాలి.

**- వెంకటేశ్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, కెరమెరి**

# యూనిఫాం క్లాత్ వచ్చేసింది!

- జూన్‌లో విద్యార్థులకు అందించేలా చర్యలు
- మండలాల వారీగా వస్త్రం పంపిణీ
- జిల్లాకు చేరిన 2,30,825 మీటర్లు


ఎంఈవో కార్యాలయంలో వస్త్రం అందజేస్తున్న అధికారులు (ఫైల్)

**ఆసిఫాబాద్‌రూరల్:** ప్రభుత్వం సర్కారు బడిలో చదువుతున్న విద్యార్థులకు ఏటా రెండు జతల యూనిఫాంలు అందజేస్తోంది. ఇందులో భాగంగా వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన యూనిఫాం క్లాత్ జిల్లాకు చేరింది. ఇటీవల డీఈవో ఎంఈవో, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాల ప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫాంలు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలోని 985 ప్రభుత్వ పాఠశాలల్లో 42,450 మంది విద్యార్థులకు 2,30,825 మీటర్ల వస్త్రం పంపిణీ చేయనున్నారు.

**జిల్లాలో ఇదీ పరిస్థితి..**

జిల్లాలో మొత్తం 985 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలు 20,534 మంది, బాలురు 21, 916 మంది ఉన్నారు. కాగా ఈ విద్యాసంవత్సరం యూనిఫాం డిజైన్‌లో పలు మార్పులు చేశారు. 1 నుంచి 3వ తరగతి బాలికలకు ఫ్రాక్‌లు, 4,5 తరగతుల బాలికలకు స్కర్ట్, కుచ్చిళ్లు పెట్టి కుట్టాల్సి ఉంటుంది. 6 నుంచి 12వ తరగతి బాలికలకు పంజాబీ డ్రెస్సులు అందజేయాలని నిర్ణయించారు. బాలురకు షర్టు, నిక్కర్, ప్యాంట్ అందించనున్నారు. యూనిఫాంల డిజైన్‌లు మార్చినా దర్జీకి చెల్లించే కూలి మాత్రం పెంచకపోవడంపై సంబంధిత ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**ధర మాత్రం పెరగలే..**

యూనిఫాం ఒక జతకు రూ.50 దర్జీ కుట్టుకూలి చెల్లించనున్నారు. డిజైన్‌లు మార్చినా కుట్టుకూలి మాత్రం పెంచలేదు. ఇంత తక్కువ కూలి చెల్లిస్తే దర్జీలు యూనిఫాంలు కుట్టేందుకు ముందుకు వస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే యూనిఫాం బయట కుట్టిస్తే జతకు కనీసం రూ.300 నుంచి రూ.400 తీసుకుంటున్నారు. గతంలో దర్జీలు సరిగా కుట్టకపోవడంతో సరైన సైజులు రాక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

### మే లోగా పూర్తి చేయాలి

జిల్లాకు వచ్చిన యూనిఫాం వస్త్రం అన్ని మండలాల ఎమ్మార్సీలకు అందజేశాం. డీఈవో అశోక్ ఎంఈవో, హెచ్‌ఎంలకు సమావేశం నిర్వహించి మేలోపు యూనిఫాం కుట్టించి సిద్ధంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. కొన్ని మండలాల్లో ఇప్పటికే యూనిఫాం కుట్టడం ప్రారంభించారు.

**- సత్తయ్య, కమ్యూనిటీ మొబలైజేషన్ కన్వీనర్**

## క్లుప్తంగా

### 'కల్యాణ లక్ష్మి' డబ్బులేవి?


మాట్లాడుతున్న సుజాయత్ ఖాన్

**కెరమెరి:** వివాహాలు జరిగి ఏడాది దాటినా ఇంత వరకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ డబ్బులు అందలేదని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయత్ ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని సుల్తాన్‌గూడకు చెందిన పలువురు దరఖాస్తుదారులతో కలిసి ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని డబ్బులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మి, రేఖ, ఫర్జానా, రాధా, ఆనంద్‌కర్, సందీప్, తిరుపతి తదితరులు ఉన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రం సందర్శన


సరుకులు పరిశీలిస్తున్న కుమారి

**కెరమెరి:** ఈ నెల 15 వరకు అంగన్‌వాడీ టీచర్లు సెలవుల్లో ఉన్నారని వారు వచ్చే అంగన్‌వాడీ కేంద్రాలను జాగ్రత్తగా కొనసాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి అంగన్‌వాడీ ఆయాలకు సూచించారు. గురువారం మండలంలోని ఎస్సీ కాలనీలో ఉన్న కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సరుకులను పరిశీలించారు.

### ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

**బెజ్జూర్:** మండలంలోని ఎలుకపెల్లి(బి) అభయాంజనేయ స్వామి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, సభ్యులు భాస్కర్ రాజు, శ్రీనివాస్, శ్రీరామ్ మోహన్, మహేందర్, తిరుపతి, భీంరావు, వెంకటి, హనుమంతు, నాగన్న పాల్గొన్నారు.

### వీవోఏల సమస్యలు పరిష్కరించాలి


సమ్మె చేస్తున్న వీవోఏలు

**కౌటాల:** ఐకేపీ వీవోఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె 18వ రోజు బుధవారం కొనసాగింది. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములే దత్తు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీవోఏలు రవి, కొండయ్య, సురేష్, అశోక్, శంకర్, మహేశ్వరి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

## 'కంటి వెలుగు' శిబిరం పరిశీలన


కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న వినోద్

**దహెగాం:** మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని గురువారం కంటివెలుగు ప్రోగ్రాం జిల్లా అధికారి వినోద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

**చింతలమానెపల్లిలో..**

**చింతలమానెపల్లి:** ప్రజల కంటి ఆరోగ్యం కోసమే ప్రభుత్వం కంటి వెలుగు శిబిరాన్ని నిర్వహిస్తుందని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. మండలంలోని రుద్రాపూర్‌లో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించారు. వైద్యాధికారి బండి సాయిక్రిష్ణ గౌడ్ , టీఆర్ఎస్ నాయకులు డుబ్బుల వెంకన్న, టోంబ్రె మారుతి, రంగయ్య, కోటేశ్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ఎడులాపురం:** నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఏడాది సోయాబీన్ విక్రాంత్ సీడ్స్‌ను కొని లక్షల రూపాయలు రైతులు నష్టపోయారని తెలిపారు. ఇందుకు సంబంధించి రైతులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిహారం రాలేదన్నారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, డీలర్లకు తగు సూచనలు జారీ చేయాలని డీఏవోకు విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భీమనేని వెంకట్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దీపక్ రావు, తుడం వినోద్, తదితరులు పాల్గొన్నారు.

### 150మంది కూలీలకు తగ్గకుండా పని కల్పించాలి

**చెన్నూర్‌రూరల్:** ప్రతి గ్రామ పంచాయతీలో 150మంది కూలీలకు తగ్గకుండా పని కల్పించాలని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి, భీమారం, జైపూర్ మండలాల ఉపాధి హామీ ఏపీవోలకు, టీఏలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఆర్డీవో హాజరై మాట్లాడారు. ఉదయం 11గంటల లోపు కూలీల హాజరు తీసుకోవాలని సూచించారు. ప్రతీ రోజు రూ.200ల నుంచి రూ.272 వరకు ప్రతి కూలీకి వచ్చేలా కొలతలు పెట్టి పని చేయించాలని ఆదేశించారు. కిష్టంపేట పంచాయతీలో ఐకేపీ, ఈజీఎస్ సహకారంతో వంద శాతం మరుగుదొడ్లు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శంకరమ్మ, అయిదు మండలాల ఏపీవోలు, సీడీసీఎల్ఆర్‌సీ సురేష్, టీసీఎస్ రాజ్‌కుమార్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

### నిరుపయోగంగా ఫారెస్ట్ క్వార్టర్

**దండేపల్లి:** ఫారెస్టు సిబ్బంది పనిచేసే చోటనే నివాసముండాలనే ఉద్దేశంతో గతంలో కొన్నిచోట్ల అటవీశాఖ క్వార్టర్స్‌ను నిర్మించింది. అందులో భాగంగా దండేపల్లి మండలంలోని కొన్ని చోట్ల నిర్మించిన ఫారెస్టు క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోగా మరి కొన్ని చోట్ల సిబ్బంది నివాసం ఉండకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దండేపల్లి మండలంలోని మొకాశిగూడలో 1998 నిర్మించిన ఫారెస్టు క్వార్టర్‌లో సిబ్బంది ఉండకపోవడంతో నిరుపయోగంగా మారింది.

## కుల దేవతలకు పూజలు


పూజలు చేస్తున్న ఆదివాసీలు

**ఇంద్రవెల్లి:** మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో కుల దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెర్సపేన్, భీమల్‌దేవ్, జంగుబాయి దేవతలకు పూజలు చేసి మొక్కులు సమర్పించారు. గురువారం మండలంలోని కేస్లాపూర్ ఉర్వేత వంశీయులు, కేస్లాగూడలో హెరేకుమ్ర వంశీయులు, చిలటిగూడలో మడావి వంశీయులు పూజలు చేశారు. కొత్తగా పెళ్లిలు అయిన తమ వంశంలోని కొత్త కోడళ్లకు దేవత దర్శనం చేయించి బేటింగ్ (పరిచయం) పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.


పెర్సపేన్ దేవతను ఊరేగిస్తున్న ఆదివాసీలు


నృత్యం చేస్తున్న మహిళలు

### బుక్ కీపర్లను నియమించుకోవాలి

**కైలాస్‌నగర్:** ఐకేపీ వీవోఏల సమ్మె నేపథ్యంలో స్వయం సహాయక సంఘాల కార్యకలాపాల నిర్వహణకు అటంకం కలుగకుండా ఓ మహిళను బుక్ కీపర్‌గా నియమించుకుని, వారికి శిక్షణనందించాలని జిల్లా మహిళ సమాఖ్య అధ్యక్షురాలు ఎం.వనజ సూచించారు. సమాఖ్య జిల్లా కార్యవర్గ సమావేశాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. వీఓఏల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఆడిట్‌కు అభ్యంతరాలు లేకుండా వారి వద్ద ఉన్న బుక్స్‌ను సంఘాలకు అప్పగించాలని కోరారు. సమావేశంలో ప్రమీళ పాల్గొన్నారు.

## మార్మోగిన హరినామం..!


సంకీర్తనలకు హాజరైన భక్తులు

**చింతలమానెపల్లి:** లోక కల్యాణం కోసం ఏటా 72 గంటల పాటు నిర్వహించే అఖండ హరినామ సంకీర్తనలు గురువారం తెల్లవారు జామున ప్రారంభమయ్యాయి. మండలంలోని రవీంద్రనగర్2లోని రాధా గోపీనాథ్ సేవాకుంజ్ ప్రాంగణంలో విదుర్ జయతి ఉత్సవాలను నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాంగణాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో బెంగాలీ సాంప్రదాయ శైలిలో అలంకరించారు. కీర్తనల ఆలాపన, జపం, రాత రూపకంగా హరినామ స్మరణ 72గంటల పాటు కొనసాగుతుందని నిర్వాహక కమిటీ అధ్యక్షుడు సుభాష్ మండల్, సర్పంచ్ సుశీల్‌లు పేర్కొన్నారు. 17వ సారి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 6 గంటలకు ముగుస్తుందన్నారు. భక్తుల కోసం అన్నదానం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


హరినామం రాస్తున్న యువతి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పూజారి


సంకీర్తనలు పాడుతున్న బృందం


కొనసాగుతున్న అన్నదానం

### తెలంగాణ భరోసా సభ పోస్టర్ ఆవిష్కరణ

**నార్నూర్:** హైదరాబాద్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహిస్తున్న తెలంగాణ భరోసా సభ పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బీఎస్పీ మండలాధ్యక్షుడు మహూర్కర్ నవీన్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రభుత్వం అవలభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై బీఎస్పీ నిరంతరం పోడుతుందన్నారు. ప్రభుత్వం పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివాజీ లోఖండే, ప్రమోద్ ఝూడే, చునార్కర్ రాజశేఖర్, మస్కే సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

### మాలమహానాడు పట్టణ కమిటీ ఎన్నిక

**పాతమంచిర్యాల:** జాతీయ మాలమహానాడు మంచిర్యాల పట్టణ కమిటీ ఎన్నికలు జిల్లా కేంద్రంలో గురువారం జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షులు గజెల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా గజెల్లి రాజమల్లు, ఉపాధ్యక్షుడిగా కొప్పుల తిరుపతి, రెక్కి సతీష్, ప్రధాన కార్యదర్శిగా ఐత రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆసాది పురుషోత్తం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతపురి జనార్ధన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

### శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం

**రామకృష్ణాపూర్:** శ్రమశక్తి అవార్డు పొందిన టీబీజీకేఎస్ సీనియర్ నాయకులు, ఆర్‌కేపీ సీహెచ్‌పీ ఫిట్ కార్యదర్శి శంకర్రావును గురువారం సీహెచ్‌పీలో టీబీజీకేఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో శంకర్రావు ఎప్పుడు ముందుంటారని అన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు బడికల సంపత్, బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, ఓ.రాజశేఖర్, నీలం శ్రీనివాస్‌గౌడ్, కోల చంద్రమోహన్ పాల్గొన్నారు.

### సాక్షి సినిమాలు

**ఆసిఫాబాద్**

| | |
|---|---|
| కుమురంభీం | : రామబాణం |

**కాగజ్‌నగర్**

| | |
|---|---|
| వెంకటరమణ | : రామబాణం |

- ఆసిఫాబాద్‌అర్బన్

### కూరగాయల ధరలు

| కూరగాయలు | ధర(కిలో) |
|---|---|
| టమాటా | రూ.20 |
| సిమ్లామిర్చి | 100 |
| దోసకాయ | 60 |
| చామగడ్డ | 80 |
| వంకాయ | 40 |
| బీరకాయ | 80 |
| కాకరకాయ | 60 |
| బెండకాయ | 60 |
| అలసంద | 60 |
| దొండకాయ | 60 |
| పచ్చిమిర్చి | 50 |
| పాలకూర | 40 |
| సోరకాయ | 60 |
| రతాళం | 60 |
| గోబి(పూల్) | 80 |
| క్యాబేజి | 60 |

-ఆసిఫాబాద్‌అర్బన్